క్లుప్తంగా

ఆత్మీయ కలయిక

లింగపాలెం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదివారం బెంగళూరులో వైఎస్సార్‌సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధినేత సూచనలు చేసినట్టు బీవీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌ని కలిసిన అంబేడ్కర్ మిషన్ ఇండియా సభ్యులు

కొయ్యలగూడెం: కొత్తూరులో ఏర్పాటు చేయనున్న భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరుకావాల్సిందిగా అంబేడ్కర్ మిషన్ ఇండియా సభ్యులు సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌ని కలిసి ఆహ్వానించారు. ఈమేరకు ఆదివారం సభ్యులు చింతలపూడిలోని సునీల్ నివాసంలో ఆయన్ను కలిశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సునీల్ హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఏఐఎం మండల అధ్యక్షుడు తొర్లపాటి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు ఉసల సుభాస్ చంద్రబోస్, మండల కార్యదర్శి కొనల పాటేశ్వరావు, బోనగిరి ఆశీర్వాదం, కొడమంచిలి జాన్ వెస్లీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం మరమ్మతులు, లైన్లు కింద చెట్ల కొమ్మలను నరకడం వంటి పనులు నిర్వహిస్తామని ఆ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. వీటి కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోడిగూడెం, కొమ్మర, సత్తెన్నగూడెం, రాళ్లకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

లాడ్జిల తనిఖీ



లాడ్జి తనిఖీ చేస్తున్న డీఎస్పీ

జంగారెడ్డిగూడెం: అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనలో భాగంగా పట్టణంలో లాడ్జిలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు డీఎస్పీ యు.రవి చంద్ర తెలిపారు. శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పట్టణంలో లాడ్జీలను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లాడ్జిల్లో బస చేసిన వ్యక్తుల వివరాలు సేకరించి వారిపై గతంలో ఏదైనా కేసు ఉందా లేదా అనేది పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్సై షేక్ జబీర్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య విగ్రహ ఏర్పాటుకు తీర్మానం



చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం అభివృద్ధి ప్రదాతగా నిలిచిన కొల్లూరు విశ్వేశ్వరయ్య విగ్రహ స్థాపనపై ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చర్చించారు. గ్రామ అభివృద్ధికి సుమారు ఇప్పటి లెక్కల ప్రకారం రూ.500 కోట్ల ఆస్తులను ఆయన ప్రభుత్వ కార్యాలయాలకు పేదలకు దానం చేశారని వక్తలు పేర్కొన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న స్థలంలో త్వరలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సమావేశం తీర్మానం చేసింది.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదవేగి : మండలంలోని పినకడిమిలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై దాడులు చేసినట్లు ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో 9 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3 కోడిపుంజులు, 7 మోటారు సైకిళ్లు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ నాగాస్విని పేరంటాలు తల్లి నాల్గవ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కూచిపూడి నృత్యాలు, చింతామణి నాటక ఆహుతులను అలరించాయి.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో

- భూమిలో ఇంకనున్న వర్షపు నీరు
- కలుపు నివారణకు చక్కటి మార్గం



మెట్ట ప్రాంతంలో వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో రానురాను వ్యవసాయ భూములకు అందాల్సిన స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితి పట్ల చాలా ఏళ్లుగా వ్యవసాయ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటం వల్ల పశువుల ఎరువు పుష్కలంగా లభించేది. దీనిని రైతులు సేంద్రియ ఎరువుగా పంటలకు వాడేవారు. క్రమేపీ వ్యవసాయ రంగంలో యంత్ర పనిముట్లకు అలవాటు పడడంతో రైతులు పశువుల పెంపకాన్ని తగ్గించారు. దీంతో సేంద్రియ ఎరువుకు కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా రసాయన ఎరువులు వాడటం మూలంగా భూసారం దెబ్బతినడమే కాక పైరుకు అవసరమైన పోషక పదార్థాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీనివల్ల దిగుబడులు తగ్గిపోవడం, చీడ పీడల ఉధృతి పెరగడం వంటి పరిస్థితులు తలెత్తాయి. రైతులు సరైన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో ఏటా 17,500 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేస్తారు. పంటకాలం పూర్తయ్యాక తొలకరి వర్షాలు కురిసేవరకు భూమిని పట్టించుకోరు.

చీడపీడల నివారణ

వేసవి దుక్కులతో పంటలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సాధారణంగా రైతులు కోతలు పూర్తవగానే పొలాలను అలాగే వదిలేస్తారు. మళ్లీ తొలకరి పలకరించగానే సాగుకు సిద్ధమవుతారు. చినుకులు పడగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలోనే దుక్కులు దున్నడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరుగుతాయి. అవి భూమిలోని నీటిని, పోషక పదార్థాల్ని గ్రహించి పెరుగుతాయి. కారణంగా భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోతుంది. భూసారం తగ్గిపోతుంది. రైతు వేసిన పంటకు పోషకాలు లభించవు. వేసవి దుక్కుల వల్ల భూమి లోపలి పొరల్లో దాగివున్న కీటకాల గుడ్లు, శిలీంద్రాలు బయటకు వచ్చి ఎండ తీవ్రతకు నశిస్తాయి. దుక్కిలో బయటపడిన పురుగులను పక్షులు తినడం వల్ల పంటలకు చీడ పీడల బెడద తప్పుతుంది.

భూసారం పెంచడం ఎలా?

భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట సాగు చేయాలి. దీనివల్ల భూసారం పెరగడమేకాక చీడ పీడల బెడద తప్పి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో నివశించే జీవరాశులకు ఆహారంగా, మొక్కలకు కావల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా ఈ పచ్చిరొట్ట పంటలు ఉపయోగ పడతాయి.

నేల సారవంతమవుతుంది



భూమిని 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కులు దున్నడం వల్ల నేలలో గాలి లభ్యత పెరిగి సూక్ష్మ జీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థం లభ్యత పెరిగి నేల సారవంతమవుతుంది. భూమికి వాలుగా దుక్కి దున్నడంతో వర్షం కురిసినప్పుడు ఆనీరు భూమి లోపలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజని వర్షపు నీటితో కలిసి నేలకు చేరడంతో సారవంతంగా మారుతుంది.

– బి నాగకుమార్, సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ



కొయ్యలగూడెం: మిషనరీ హాస్పిటల్ బరియల్ గ్రౌండ్‌లో పూర్వీకులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


చింతలపూడి: ఈస్టర్ పండుగను క్రైస్తవులు చింతలపూడి మండలంలో ఆదివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బోయగూడెం ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు వేకువ జామునే యేసు పునరుత్థాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాపుల రక్షణకోసం శిలువ వేయబడి తిరిగి లేచిన క్రీస్తు ఔన్నత్యాన్ని రోమన్ కేథలిక్ మిషన్ ఫాదర్ కామా మాధ్యూ బోధించారు. ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన తర్వాత ప్రత్యేక సమాధిలో ఉంచబడిన అద్భుత ఘట్టాన్ని చర్చ్ ఆవరణలో భారీ సెట్టింగ్‌లతో నిర్మించారు. కార్యక్రమంలో కన్య స్త్రీలు, ఉపదేశికులు, సంఘ పెద్దలు, విశ్వాసులు, వివిధ గ్రామాల క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు పునరుత్థాన పుణ్య దినం ఈస్టర్ అని పాస్టర్ రాజేష్ అన్నారు. అంకాలగూడెం మిషనరీ హాస్పిటల్ బరేల్ గ్రౌండ్‌లో కొవ్వొత్తులు వెలిగించి పూర్వీకులకు శ్రద్ధాంజలి ఘటించారు. అదేవిధంగా ఎర్రంపేట గ్రామంలోని ప్రధాన చర్చిలలో క్రీస్తు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, వేదాంతపురం, బయ్యన్నగూడెం, రాజవరం, గ్రామాల్లో బరేల్ గ్రౌండ్‌లను సుందరంగా ఆధునీకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు.

గిరిపల్లెల్లో ఈస్టర్ వేడుకలు

బుట్టాయగూడెం: గిరిపల్లెల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని ఉద్బోధించారు. చర్చిల్లో సంఘస్తులు ప్రత్యేక గీతాలు ఆలపించి క్రీస్తును ఆరాధించారు. బుట్టాయగూడెం లూథరన్ చర్చిలో కోట నాగవరంనకు చెందిన పెద్దలు పాలగుల కోటీశ్వరరావు, తలారి రాజు చేతుల మీదుగా వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. దొరమామిడి, రెడ్డి గణపవరం, కేఆర్‌పురం, కొమ్ముగూడెం. రామారావుపేట తదితర గ్రామాల్లో ఈస్టర్ పండుగ నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: ఈస్టర్ వేడుకలను జంగారెడ్డిగూడెంలో ఆదివారం క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు లూథరన్ దేవాలయం సంఘ కాపరి జి.రమేష్ బాబు సర్వ మానవాళికి ఏసుక్రీస్తు రక్షకుడని, ఆయన బోధనలు ఆచరణీయమని ఉద్బోధించారు. ఈ సందర్భంగా విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



చింతలపూడి: బోయగూడెం సీఎస్ఐ చర్చిలో క్రీస్తు ఔన్నత్యాన్ని వివరిస్తున్న ఫాదర్ కామా మాధ్యూ



కొయ్యలగూడెం: యర్రంపేటలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు



జంగారెడ్డిగూడెం: సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భార్యాభర్తల గొడవలోకి వెళ్లి.. దాడి

ద్వారకాతిరుమల: గొడవ పడుతున్న భార్యాభర్తలకు సర్దిచెప్పేందుకు వెళ్లి భర్తపైన, అతని తల్లిదండ్రులపైన దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన మానుకొండ రామారావు చిన్న కొడుకు, కోడలు ఈనెల 16న సాయంత్రం గొడవపడ్డారు. ఆ సమయంలో కోడలు పిలవడంతో అదే గ్రామానికి చెందిన ముంగమూరి రాంపండు వారి ఇంటికి వెళ్లాడు. అతడు భార్యాభర్తలతో మాట్లాడే సమయంలో గొడవ మరింతగా పెరిగింది. దాంతో రామారావు భార్య వచ్చి భార్యాభర్తల మధ్య నువ్వెందుకు, వాళ్లే సర్దుకుంటారని చెప్పింది. దాంతో రాంపండు ఆమెను తిడుతూ కిందకు నెట్టివేయడంతో కింద పడిపోయింది. వెంటనే గ్రామానికి చెందిన ముంగమూరి లక్ష్మణరావు, ముంగమూరి సుబ్బారావు దుంగలు పట్టుకొచ్చి రామారావుపై దాడి చేశారు. ఈ దాడిలో అతడి ఎడమ చేయి చిటికెన వేలు విరిగిపోయి, తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అడ్డువచ్చిన రామారావు భార్య, చిన్న కుమారుడిపై సైతం వారు దాడి చేశారు. గాయపడ్డ వారంతా జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. బాధితుడు రామారావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: వ్యక్తి మృతిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామానికి చెందిన ఆలపాటి జగదీష్ కుమార్‌కు చెందిన హోటల్‌లో నూజివీడుకు చెందిన పవన్ (35) పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న పవన్ మద్యం సేవించి సోయలేకుండా పడిపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో చేర్చారు. మరుసటి రోజున విషయం తెలుసుకున్న జగదీష్ కుమార్ ఆస్పత్రికి వెళ్లి, మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరించాడు. అక్కడ చికిత్స పొందుతూ పవన్ ఈనెల 17న మృతి చెందాడు. మృతుడి వివరాల కోసం ఎంత ప్రయత్నించినా తెలియలేదు. అయితే పవన్ మద్యం తాగడం వల్ల ఆరోగ్యం పాడై మృతి చెందినట్టు జగదీష్ కుమార్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్ చోరీపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: బస్సు ఎక్కుతున్న సమయంలో ఓ భక్తుడి జేబులోని సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. ఏఎస్సై అమీర్ తెలిపిన వివరాల ప్రకారం. పెదవేగి మండలం రామన్నపాలెంకు చెందిన మట్టా అశోక్ రాజు ఈనెల 18 ఉదయం ద్వారకాతిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో కొత్త బస్టాండులో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతడి జేబులోని సెల్ ఫోన్‌ను తస్కరించారు. బాధితుడు తన స్నేహితుడి ఫోన్ నుంచి, పోయిన సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దాంతో అతడు 19న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

శ్రీనివాసుని దివ్య కల్యాణోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లను కల్యాణ మూర్తులుగా ముస్తాబు చేస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాధ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో స్వామివారిని పెండ్లి కుమారునిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ వేడుక అత్యంత వైభవోపేతంగా జరిగింది. అంతక ముందు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికను ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించారు. అనంతరం సింహాసనంపై కల్యాణ మూర్తులను వేంచేపు చేసి ఈ తంతును నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, పలువురు భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సుబ్బమ్మపేట రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బమ్మ పేట రోడ్డుకు మోక్షం కలగనుంది. చాల ఏళ్లుగా రోడ్డు ధ్వంసమై ఇక్కడి పడుతున్న ప్రజల ఇబ్బందుల దృష్ట్యా నూతన రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. 30 ఏళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని చెప్పారు. దీంతో రూ.69 లక్షలతో 15 ఫైనాన్స్ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో చాలా వరకూ రోడ్లు నిర్మాణం పూర్తి చేశామన్నారు. అలాగే మున్సిపల్ ఆఫీస్ నుంచి కాలేజి రోడ్డు శ్రీనివాస పురం జంక్షన్ వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామాయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తత అవసరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న యోగానంద నేత్రవైద్యశాల బృందం సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కంటి సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్య శాల వైద్యులు సూచించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం, ఉషా గ్రూప్ సంస్థల అధినేత ఉషా బాలకృష్ణ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది అంధులు చూపులేక ప్రపంచాన్ని చూసే అదృష్టం లేక విలవిల్లాడిపోతున్నారన్నారు. చూపు ఉన్నవారు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయవద్దని, కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంట వైద్యులను సంప్రదించి చికిత్స పొంది కంటి చూపును కాపాడుకోవాలని హితవు పలికారు. ఈ శిబిరంలో 186 మంది పాల్గొనగా వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. గుర్తించిన వారికి శస్త్రచికిత్స నిమిత్తం నేత్రవైద్యశాలకు తీసుకువెళ్లారు. అలాగే అవసరమైన 36 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరకు పంపిణీ చేశారు. కార్యక్రమం ప్రతి నెలా మూడవ ఆదివారం గత 12 ఏళ్లుగా జరుగుతోందని, నేత్ర సమస్యలు ఉన్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానేపల్లి రామారావు కోరారు.

కూర్మ ‘వీక్షణం’



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలో నిర్మించిన ట్యాంక్‌లోని తాబేళ్లను వీక్షిస్తున్న భక్తులు
ట్యాంక్‌లో ఉన్న తాబేలు (అంతర చిత్రం)

ద్వారకాతిరుమల: శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన తాబేళ్ల ట్యాంక్ చూపరులను ఆకట్టుకుంటోంది. పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో ఈ ట్యాంక్‌ను నిర్మించి, అందులో తాబేళ్లను ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికి వస్తున్న భక్తులు వీటిని ఎంతో ఆసక్తిగా వీక్షిస్తున్నారు. చిన్నా, పెద్దా అంతా ఈ ప్రాంతంలో సందడి చేస్తున్నారు. భక్తజన సంచారం అధికంగా ఉండే ప్రాంతంలో వీటి ఏర్పాటు పట్ల పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రిజ్‌లు వద్దు.. కుండలే ముద్దు

- వేసవిలో మట్టి కుండల వైపు మొగ్గుచూపుతున్న ప్రజలు
- ఒక్కో కుండ ధర రూ.100 పైమాటే
- మట్టి కుండ నీరే మంచిదంటున్న వైద్యులు



అమ్మకానికి సిద్ధంగా మట్టి కుండలు, కూజాలు

ద్వారకాతిరుమల: రోజురోజుకు ఎండలు పెరిగిపోతున్నాయి. దాంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రిఫ్రిజిరేటర్లలోని చల్లని నీటితో దాహం తీర్చుకుంటున్నారు. ఆ ఫ్రిడ్జ్‌లలోని నీరు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. మట్టి కుండలే మేలని, అందులోని నీరే తాగాలని అంటున్నారు. దాంతో ఓల్డ్ ఈజ్ గోల్డ్ మట్టి కుండలు అంటూ అన్ని వర్గాల ప్రజలు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే మట్టి కుండల విక్రయాలు ఊపందుకుంటున్నాయి.

ఫ్రిజ్‌లతో ఆరోగ్య సమస్యలు..

వేసవి తాపాన్ని తీర్చేది చల్లని నీరు. సామాన్య ప్రజలకు ఆ చల్లటి నీటిని అందించేవి మట్టి కుండలు మాత్రమే. అందుకే మట్టి కుండలను పేదవాడి ఫ్రిజ్‌లు అని అంటారు. మానవుల జీవనశైలిలో మార్పులు రావడంతో ఇప్పుడు దాదాపు అందరి ఇళ్లలోనూ ఫ్రిజ్‌లు దర్శనమిస్తున్నాయి. ఎక్కడో పేదవారి ఇళ్లలో మాత్రమే కుండలు కనిపిస్తున్నాయి. ఫ్రిడ్జ్‌ల వాడకం ఏ విధంగా పెరిగాయో.. ప్రజలకు ఆరోగ్య సమస్యలు కూడా అదేవిధంగా పెరిగాయి. ఇప్పుడు అనారోగ్యంతో ఏ వైద్యుడి వద్దకు వెళ్లినా ఫ్రిజ్‌లలో నీరు తాగొద్దని, అందులో పెట్టే వస్తువులను తినొద్దనే చెబుతున్నారు. అవి తినడం, తాగడం వల్ల ఊపిరి తిత్తులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. దాంతో కొందరు ధనికులు సైతం ఫ్రిజ్‌ల వాడకాన్ని బాగా తగ్గించారు. ఈ క్రమంలోనే కాలం చెల్లిందనుకున్న కుండలకు మళ్లీ పూర్వవైభవం వస్తోంది.

పట్టణాలకు ఎగుమతి..

భీమడోలు మండలం పొలసానిపల్లికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు కుటుంబం ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు లోని జాతీయ రహదారి ప్రక్కన గణపతి, కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను, వేసవిలో మట్టి కుండలు, కూజాలను తయారు చేస్తున్నారు. వాటి విక్రయాల ద్వారానే జీవనోపాధిని పొందుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఉండటంతో వీటి విక్రయాలు ఊపందుకుంటున్నాయి. సైజును బట్టి ఒక్కో కుండ, కూజాను రూ.100కు పైగా విక్రయిస్తున్నారు. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర పట్టణాలకు చెందిన కొందరు వ్యాపారులు కుండలు, కూజాలను ఇక్కడ నుంచే కొనుగోలు చేసి తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

పేదవాడికి ఈ కుండలే ఫ్రిజ్‌లు



ప్రతి ఏటా కంటే ఈ ఏడు మట్టి కుండల విక్రయాలు పెరిగాయి. ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం ఆరోగ్య రీత్యా ఈ కుండలను కొనుగోలు చేస్తున్నారు. దాంతో వీటి తయారీని కూడా పెంచాము. వేసవిలో పేదవాడికి ఈ కుండలే ఫ్రిజ్‌లు. పలు పట్టణాలకు చెందిన వ్యాపారులు మా వద్దే కుండలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

– పేరవరపు నాగేశ్వరరావు, కుండల తయారీదారుడు

ఆరోగ్య సమస్యలకు కారణం ఫ్రిజ్‌లు



ఫ్రిజ్‌లలోని నీటిని తాగడం, అందులో పెట్టినవి తినడం వల్లే ప్రజలకు ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఫ్రిజ్‌ల వాడకాన్ని బాగా తగ్గించాలి. మట్టి కుండల్లోని నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది. వేసవిలో ఫ్రిజ్‌ల కంటే మట్టి కుండలు, కూజాలే మేలు.

– ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు, ద్వారకాతిరుమల